ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**(భీమవరంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 16-11-97)**

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

భగవంతుడు మన హృదయంలో చైతన్య రూపంలో, ఆనంద రూపంలో ఉన్నాడు. దేవాలయంలో ఉన్న దేవుని మీద మనకు ఉన్న విశ్వాసం హృదయంలో ఉన్న దేవుని మీద మనకు లేదు. మన హృదయంలో ఆనందం ఉంది. అది మనకు అనుభవంలోనికి రావటం లేదు. ఆనందం అనుభవంలోనికి రాకుండా ఏ అహంభావన అయితే అడ్డువస్తోందో దానిని వేరుతో సహా తొలగించి ఆనందమును మన చేతికి అందించే వాడే గురువు. మనకు ఎంత తెలివి ఉన్నా, సమాజంలో ఎంత గౌరవం ఉన్నా, ఎంత ధనం ఉన్నా మనం సత్యాన్ని సమీపించలేము. వైరాగ్యం లేకుండా, మనోనిగ్రహం లేకుండా, ఇంద్రియనిగ్రహం లేకుండా, తత్వం తెలియకుండా మన హృదయంలో ఉన్న సత్యాన్ని సమీపించలేము. తత్వాన్ని శ్రవణంచేసి తత్వానికి సంబంధించిన అనుభవం పొందకపోతే మీకు సత్యసాక్షాత్కారము సమస్యేలేదు. సత్యం గురించి తెలియకపోతే మీకు స్వేచ్ఛలేదు, శాంతిలేదు ఎవరి మీద అయినా ప్రేమ, అభిమానం ఉండవచ్చు. కాని ఆప్రేమలో, ఆ అభిమానంలో మమకారం కలువకూడదు. మమకారం కలిస్తే దుఃఖం నిన్ను వెంటాడుతుంది నీకు ధనం ఉందా లేదా, చదువు ఉందా లేదా, నీవు ఏకులంలో పుట్టావు, ఏ ప్రాంతంలో పుట్టావు అన్నది సమస్యకాదు. నీకు మమకారం ఉంటే కోటి జన్మలు ఎత్తినా ప్రతీ జన్మలో కూడా దుఃఖం నిన్ను వెంటాడుతుంది నీకు ధనం ఉంటే భోగం వస్తుంది. నీకు జ్ఞానం కలిగితే మోక్షం వస్తుంది. ఆనందం ఎక్కడో ఉంది అని మనం వెతుకుచున్నాము. ఆనందం అనేది మన హృదయంలోనే ఉంది అనే దృఢ నిశ్చయం మనకు రావాలి.

జీవుడు ఎప్పుడయితే ఈశ్వరుడిలో ఐక్యం అయ్యాడో అప్పుడు ఈశ్వర స్వరూపాన్ని పొందుతాడు. తనలో ఐక్యం అయిన జీవుడిని ఈశ్వరుడు వదిలివేయడు, తన స్వరూపాన్ని ఇస్తాడు. ఆ స్వరూపమే నిజమైన నేను, అదే మోక్షం. జీవుడిని ఈశ్వరుడిలో ఐక్యం చేయకపోతే శరీరం మరణించిన తరువాత జీవుడు స్వర్గానికిగాని, నరకానికి గాని వెళతాడు. స్వర్గానికి వెళితే సంతోషపెడతారు, నరకానికి వెళితే బాధపెడతారు. సంతోషపడేది, బాధపడేది జీవుడే ఇవి అన్నీ వ్యవహారిక సత్యములు మాత్రమే ,పారమార్థిక సత్యములు కావు. శరీరం మరణించకముందే జీవుడు ఈశ్వరుడిలో ఐక్యమయితే స్వర్గానికి, నరకానికి వెళ్ళ నక్కర లేదు భగవంతునిలో ఐక్యమయిపోతాము, భగవంతుని స్వరూపముగా మిగిలిపోతాము. అప్పుడు రాకపోకలతో సంబంధం లేదు. సందేహించ వలసిన పని లేదు. మీలో ఉన్న లోపములు మీ కంటే గురువుకు బాగా తెలుసు. కాని మీలో ఈ లోపం ఉంది అని గురువు మీకు చెప్పడు.

ఆలోపం నుండి జీవుడిని విడుదల చేసి మోక్షాన్ని ఇస్తాడు. వాడు గురువు., విషయాలమీద, వస్తువులు మీద, లోకం మీద మనకు భ్రాంతి కలుగుతోంది అంటే దానికి సంబంధించిన వాసన మన లోపల ఉంది అని అర్థం ఎక్కడో హృదయం యొక్క లోయలలో ఉన్న వాసనలను లాగి మంట పెడతాడు వాడు గురువు. శరీరం మరణించిన తరువాత ఎడ్రస్ తెలియనంత దూరం వెళ్ళిపోతాము, కాని గురువుకు మన ఎడ్రస్ తెలుస్తూ ఉంటుంది. ఆయనకు దేహంతో లోకంతో పనిలేకపోయినా మన కోసం ఒక దేహం ధరించి వచ్చి మనం ఏ దేశంలో ఉన్నా, ఏమతంలో ఉన్నా, ఏకులంలో ఉన్నా ఆయనే మనలను ఆకర్షించుకొని మనకు బోధచేస్తాడు. మహాగురువు చెప్పే బోధ ఎలా ఉంటుంది అంటే మంట మీద నీరుపోస్తే అది వెంటనే ఎలా చల్లారిపోతుందో అలా గురువు బోధ వలన మనలో ఎంత అశాంతి ఉన్నా, ఆందోళన ఉన్నా అది అంతా వెంటనే పోతుంది. గురువు యొక్క ఆకర్షణ చాలా బలీయంగా ఉంటుంది. గురువు అంటే ఆత్మే. గురువు మనలో నిజమైన ఆత్మగా ఉన్నాడు. మనలను ఆయన దగ్గరకు ఆయనే ఆకర్షించుకొని ఆయన మీద ప్రేమకలిగేటట్లు చేసుకొంటాడు. గురువు చెప్పే మాటలు మనపొడుబుద్ధికి అర్థంకావు. ఆయన మాటలు మనకి అర్థమయ్యేటట్లు ఆయనే మనలను అనుగ్రహించి మనకు సాధన చేసే బలాన్ని ఇచ్చి మనకి ఆత్మవిద్యను ప్రసాదించి ఆత్మసాక్షాత్కారము కలుగజేస్తాడు. నిజమైన విద్య, సత్యమైన విద్య, నీవు ఎవడో నీకు పట్టి ఇచ్చే విద్య ఆత్మవిద్య మాత్రమే. మిగిలన విద్యలు అన్నీ కేవలము నీపొట్టకే పరిమితం. భగవంతుడు మనకు అనేక అవకాశములు ఇచ్చాడు. మానవ శరీరం ఇచ్చాడు, శాస్త్రాన్ని ఇచ్చాడు, మహాగురువులను ప్రసాదించాడు ఇన్ని అవకాశములను నీవు సద్వినియోగం చేసుకోకుండా ఎప్పడో మరణించిన తరువాత, రాబోయే జన్మలో సాధన చేస్తాను అంటే అది నిజంకాదు. చేతిలో ఉన్న అవకాశములను విడిచిపెట్టవద్దు. భగవంతుడు మీ హృదయంలో మీకు అత్యంత సమీపంగా ఉన్నాడు. ఆయన గురించి తెలుసుకోకుండా ఎక్కడో దేవుడు ఉన్నాడు అని లోకం అంతా తిరగటం ఎటువంటిది అంటే మన చేతిలో ఉన్న బంగారాన్ని బయటకు విసిరేసి రోడ్డుమీద ఉన్న గాజు ముక్కలను వెతుక్కోవటం వంటిది.

మనకు తెలిసినా, తెలియకపోయినా జరిగేది ఈశ్వర సంకల్పమే. మనం ఈశ్వర సంకల్పం చేతిలో పనిముట్టుగా అయిపోతే ఉత్తమస్థితిని పొందుతాము. ఈలోకానికి, ఈదేహానికి మనలను బంధించేది మనస్సే ఆ మనస్సులోని విషయాలను నీవు వదిలివేయగలిగితే నీవు పనిచేసే పరిధి పెరుగుతుంది నీ మనస్సు విశాలమవుతుంది. నీబుద్ధికి పరిణితి వస్తుంది. నీ బుద్ధికి పరిణితి వచ్చేకొలది పరిమితుల తగ్గిపోతాయి. నీ ప్రేమ యొక్క పరిధులు పెరుగుతూ ఉంటే నీభక్తిభావన పెరుగుతోంది అని గుర్తు. నీవు ఏపనిచేస్తున్నావు, ఎలా చేస్తున్నావు అని భగవంతుడు చూడడు. నీ తలంపును భగవంతుడు చూస్తాడు. భగవంతుడిని మనం మోసం చేయలేము. ఆయన మన హృదయంలోనే ఉన్నాడు. బట్టలు మార్చుకొన్నంత మాత్రంచేత, దేహాలు మారినంత మాత్రం చేత నీకు జ్ఞానంరాదు. నీ బుద్ది యొక్క పరిణితి పెరగాలి. నీవు ప్రేమతో, విశ్వాసంతో పని పనికోసమేచేస్తూ ఉంటే ఆపనిలోనే ఈశ్వర